# అమ్మమనసు

"ఏమిటమ్మా, ఇంకా పొయ్యి దగ్గరే వున్నావ్? వాళ్లొచ్చేశారు" అన్నాడు వినయ్ హడావుడిగా వంటింట్లోకి వచ్చి.

"అయిపోయింది. ఆఖరువాయి. నువెళ్ళి కూర్చో! పది నిమిషాల్లో ఫలహారాలు తెస్తాను" అంది సుందరమ్మ బాణలిలో ఉడుకుతున్న గారెల్ని అట్లకాడతో కదిలిస్తూ.

"త్వరగా కానియ్" అంటూ వెళుతున్న కొడుకుని వెనక్కి తిరిగి చూస్తూ మురిపెంగా నవ్వుకుంది.

తను కన్న కలలు ఈనాటికి ఫలించాయి. తన కొడుకు ప్రయోజకుడైనాడు. జడ్జీగారి అల్లుడు కాబోతున్నాడు. తను ఈరోజు కోసమే జీవితం ప్రసాదించిన చేదునంతా నవ్వుతూ మింగింది.

ఆఖరువాయి తీసి గారెలు గిన్నెలో వేసింది. బాణలి తీసి కిందపెట్టి దొడ్లోకెళ్ళి ముఖం కడుక్కుంది. దండెం మీదవున్న ఉతికిన నేతచీర తీసి కట్టుకుంది. మూడు ప్లేట్లలో గారెలూ, మైసూరుపాకు కోపులూ సర్ది ట్రేలో పెట్టింది. భుజం నిండుగా పమిట కప్పుకొని ట్రే తీసుకొని ముందు గదిలోకి వచ్చింది.

ఎదురుగా కుర్చీలో కూర్చుని వున్న రేఖ చివ్వున లేచి రెండు చేతులూ జోడించి వినయంగా సుందరమ్మకు నమస్కరించింది. చిరునవ్వుతోనే దీవించింది సుందరమ్మ. రేఖ ముందుకొచ్చి సుందరమ్మ చేతిలోవున్న ప్లేటు అందుకొని టీపాయిమీద పెట్టింది.

సుందరమ్మ రేఖమీదనుంచి కళ్లు మరల్చుకోలేకపోయింది.

ఎంత అందం? అందానికి తగ్గ వినయ విధేయతలు. తన కొడుకు నిజంగా అదృష్టవంతుడు!

"అమ్మా! వీరు జడ్జి రామనాథంగారు... మా అమ్మండీ!" పరస్పరం పరిచయం చేశాడు వినయ్ ఉత్సాహంగా.

నమస్కారం చెయ్యబోయిన చేతులు అలాగే నిల్చిపోయాయి. కన్నార్పకుండా తననే చూస్తున్న రామనాథం ఎదుట శిలాప్రతిమలా నిలబడిపోయింది.

"నువ్వా!" అంటూ రామనాథం దెయ్యాన్ని చూచినట్టు ఒక్కసారిగా లేచి నిల్చున్నాడు.

రేఖ, వినయ్ ఇద్దర్నీ చూస్తూ అయోమయంలో పడిపోయారు.

సుందరమ్మ గిర్రున తిరిగి లోపలకు వెళ్లిపోయింది.

"మా అమ్మ మీకు తెలుసాండీ?" అన్నాడు వినయ్ రామనాథంగారి ముఖంలోకి

ఆశ్చర్యంగా చూస్తూ.

"ఊఁ..." రామనాథం కంఠం చాలా గంభీరంగా వుంది. బయటకు నడిచాడు విసురుగా.

రేఖ వినయ్ ముఖంలోకి అయోమయంగా చూసింది.

"అమ్మాయ్! రేఖా! ఇలా రా?" గర్జించినట్లే కేక వేశారు రామనాథం బయటనుంచి.

రేఖ బయటకు వెళ్ళింది. వినయ్ స్థాణువులా నిలబడి పోయాడు.

తెప్పరిల్లి వినయ్ బయటికొచ్చాడు. రామనాథం కారులో కూర్చున్నాడు. రేఖ కూడా కూర్చునే ప్రయత్నంలో వుంది. వినయ్ ఒక్క దూకులో కారు దగ్గరకెళ్ళి రేఖ జబ్బ పట్టుకుని బలంగా లాగాడు.

రేఖ వినయ్ ముఖంలోకి అదోలా చూసింది. "నా చెయ్యి వదులు" అంది నిర్లక్ష్యంగా.

"ఏమిటి రేఖా! ఏం జరిగింది? ఇలా అకస్మాత్తుగా వెళ్ళిపోతున్నారేమిటి?" అన్నాడు వినయ్ ఆత్రుతతో.

"నన్ను మర్చిపో, ఈ పెళ్లి జరగదు!" ఖచ్చితంగా అన్నది రేఖ. ఈ మాట అంటున్నప్పుడు రేఖ ఉబికి వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా అణచుకో ప్రయత్నించింది.

'రేఖా! ఏమిటి నువ్వంటున్నది? ఈ పెళ్ళి జరగదా? ఎందుకు జరగదో చెప్పు, అంతవరకు నిన్ను కదలనివ్వను.' రేఖ జబ్బ పట్టుకుని వున్న వినయ్ చెయ్యి బిగుసుకుంది.

రేఖ ముఖం ఆత్మీయుల చావు కబురు చెప్పటానికి వచ్చిన వ్యక్తి ముఖంలా వుంది.

'నేను చెప్పలేను మీ అమ్మనే అడుగు, నన్ను వదులు.' అంటూ రేఖ చెయ్యి విడిపించుకోవటానికి ప్రయత్నించింది.

'వదల్ను. నువ్వు చెప్పి తీరాలి. నన్ను తప్ప మరొకర్ని చేసుకోనని పట్టుబట్టి మీ నాన్నను ఒప్పించిన నువ్వే ఈ పెళ్లి జరగటానికి వీల్లేదు అంటున్నావ్! కారణం చెప్పి తీరాలి.' అభిమానం దెబ్బతిన్న వినయ్ అడిగాడు.

'మీ అమ్మ...' అంటూ ఆగిపోయింది రేఖ.

'ఆఁ-' మా అమ్మ ఏమిటి, చెప్పు?'

"మీ అమ్మ దేవత అని ఎప్పుడూ నా దగ్గిర పొగుడుతూ వుండేవాడివి, అంతా మోసం... పచ్చి అబద్ధం..." ఏవగింపు ఆమె మాటల్లో స్పష్టంగా పలికింది.

వినయ్ ఓ క్షణం రేఖ ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు.

'మీ అమ్మ... చెడిపోయిన మనిషి-' అంది రేఖ కసిగా.

"రేఖా!" ఒక్కసారిగా అరిచాడు వినయ్. గుప్పెళ్లు బిగించాడు. "ఆ మాట మళ్ళీ అను... చంపేస్తాను-" పిచ్చిగా అరిచాడు వినయ్.

రేఖ నిర్లక్ష్యంగా నవ్వి, చరాచరా కారు దగ్గిరకెళ్లిపోయింది.

వినయ్ రాతివిగ్రహంలా చలనరహితంగా నిలబడిపోయాడు. దూరంగా ఎక్కడో భయంకరమైన ధ్వనులు వినవస్తున్నాయి. మేఘాలు గర్జిస్తున్నాయి. రైళ్లు ఢీకొంటున్నాయ్. మహావృక్షాలు కూకటివేళ్ళతో పెళ్ళగిలి నేలకొరుగుతున్నాయి. సముద్రం గట్టులు తెంచుకుంటూంది. వినయ్ కళ్ళముందు చీకటితెరలు కమ్ముకుంటున్నాయ్.

"మీ అమ్మ చెడిపోయిన మనిషి... మీ అమ్మ చెడిపోయిన మనిషి..." చెవుల్లో అనేక కంఠాలు మారుమ్రోగుతున్నాయ్.

"అబద్ధం! అబద్ధం! మా అమ్మ దేవత! మా అమ్మ చెడిపోయిన మనిషి కాదు-" అరవాలనుకున్నాడు. కాని శక్తిలేదు.

క్రమంగా ఏమీ కన్పించడంలేదు. ఏమీ వినిపించడంలేదు. నిల్చున్నచోటే కూలబడ్డాడు. అలా ఎంతసేపు వున్నాడో అతనికే తెలియదు.

ఉన్నట్లుండి ఏదో పిచ్చిబలం వచ్చినట్లయింది. ఇంట్లోకి పరుగుతీశాడు. గదులన్నీ వెతికాడు. తల్లి కన్పించలేదు.

వంటింట్లో ఓ మూల కూర్చుని రెండు చేతుల్తో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న తల్లిని క్షణకాలంపాటు కన్నార్పకుండా చూశాడు. మెల్లగా వెళ్ళి ఆమెకు ఎదురుగా కూర్చుని ఆమె చేతుల్ని ముఖంమీదనుంచి తీశాడు.

"బాబూ!" అంటూ సుందరమ్మ కొడుకును చుట్టుకుపోయింది.

"అమ్మా! వాళ్ళన్నదంతా అబద్ధంకదూ?"

సుందరమ్మ ఆత్రంగా కొడుకుని గుండెలకు హత్తుకుంది.

"చెప్పమ్మా! అబద్ధం అని చెప్పు. నీమీద ఇంత పెద్ద అభాండం వేసిన వాళ్ళ రక్తం కళ్ళ చూస్తాను. నువ్వు చెప్పవు. కాని నాకు తెలుసమ్మా! నువ్వు దేవతవు. చూడు, ఇప్పుడే వెళ్లి ఆ రామనాథం అంతు తేలుస్తాను," చివ్వున లేచి నిల్చున్నాడు వినయ్-కట్టలు తెంచుకుంటున్న ఉద్రేకంతో.

"బాబూ!" అంటూ సుందరమ్మ కొడుకును రెండు చేతుల్తో చుట్టేసింది.

"నన్ను వదులమ్మా! నిన్ను అవమానించినవాణ్ణి... ఆ రేఖ... కూడా..." పళ్ళు పటపట కొరికాడు.

"నేను రేఖ అన్న మాటలు విన్నాను బాబూ! నేను అమ్మను. నేను ఏం చేసినా నీ కోసమే చేశానురా కన్నా!"

వినయ్ ఒక్కసారిగా నిప్పుల కుంపటిని తోసేసినట్టు తల్లిని తోసేశాడు.

ఓ క్షణం ఆమె ముఖంలోకి, గుండెల్లోకి బాణం దిగిన జంతువు వేటగాణ్ణి చూసినట్టు చూశాడు. ఆ చూపుల్ని తట్టుకోలేని సుందరమ్మ తల వంచుకుంది.

"అమ్మా... కాదు... నువ్వు అమ్మవు కాదు... అమ్మ అనే పదాన్ని కలుషితం చెయ్యను-నిన్ను అమ్మా అంటూ."

"బాబూ!"

"నన్ను అలా పిలవకు. నేను నీకు కొడుకునీ కాను, నువ్వు నాకు అమ్మవూ కాదు. నా కసలు అమ్మే లేదు. ఛీ! అలాంటి బతుకు బతక్కపోతేనేం? పైగా, ఏం చేసినా నాకోసం చేశానంటావా? అటువంటి పాడుపని నేను చెయ్యమన్నానా? ఆ పాపిష్టి డబ్బుతో నన్ను పెంచమన్నానా? నాలో ఇంత కలుషిత రక్తం ప్రవహిస్తోందా? ఛీ! వెధవ బతుకు బతికేం చచ్చేం!"

"బాబూ!" అంటూ వినయ్ చెయ్యి పట్టుకుంది సుందరమ్మ.

"నా చెయ్యి వదులు. ఇక నీ ముఖం నాకు చూపించకు" అంటూ గబగబా బయటికి వెళ్ళిపోయాడు.

పిచ్చెక్కినట్టు ఊరంతా తిరిగాడు. బుర్ర బొత్తిగా పని చెయ్యడంలేదు. ఏ ఆలోచనలూ

లేవు.

"అమ్మ అన్నది ఒక కమ్మని మాట. అది ఎన్నెన్నో జన్మల మమతల మూట!" పాట వినిపిస్తోంది ఒక హోటల్‌నుంచి.

వినయ్‌కు ఆ పాట వింటూంటే వళ్లు మండిపోయింది. హూఁ! దేవుడు లేడనే మనిషయితే వున్నాడట కాని, అమ్మే లేదనేవాడు అసలే లేడట! ఎందుకు లేడూ? తను లేడూ? అంటే తను మనిషి కాడా?

వినయ్ గుండెల్ని ఏదో మొండిరంపంతో కోస్తూంది. అది తెగటంలేదు. కాని పళ్ళచక్రం కింద చెరుకుగడలా నలుగుతోంది, మెలి తిరుగుతోంది. తలలో నరాలు చిట్లటానికి సిద్ధంగా వున్నాయి.

పార్కులోకి నడిచిందీ, ఒక ఖాళీ బెంచీమీద కూలబడిందీకూడా అతనికి తెలియదు.

పార్కు రేడియోలో మళ్ళీ అదేపాట వినిపిస్తోంది. లేచి వెళ్ళి ఆ రేడియో బద్దలు కొట్టాలనిపిస్తోంది.

"అమ్మ..." ఛీ! ఆ మాట వింటుంటేనే తన వళ్లు జలదరిస్తోంది. ఇంత భయంకర సత్యాన్ని తను ఎదుర్కోవాల్సి వుంటుందని-తను కలలోకూడా ఊహించలేదు. తను ప్రపంచానికి ఎలా ముఖం చూపిస్తాడు? ఎక్కడికో దూరంగా పారిపోవాలి? కాని ఈ దారుణ బాధ, ఈ నగ్నసత్యం తన గుండెల్ని పిండుతూనే వుంటుంది. ఈ బాధనుంచి విముక్తి పొందాలంటే ఒక్కటే మార్గం-తను శాశ్వతంగా...

ఆపైకి ఆలోచించలేకపోయాడు వినయ్. వంట్లో శక్తినంతా ఎవరో మంత్రించి లాగేసినట్లయింది, కూర్చోలేక బల్లమీద పడుకున్నాడు. మెదడూ, శరీరంకూడా బాగా అలసిపోయినై. ఏదో మైకం కమ్మినట్లయింది.

ఎవరో వీపుమీద తట్టినట్టు ఉలిక్కిపడి లేచాడు వినయ్. కళ్ళు తెరిచాడు బద్ధకంగా. చుట్టూ పరికించాడు. తెలతెలవారుతోంది. తను అక్కడకు, ఆ పార్కు బెంచీమీదకు ఎప్పుడొచ్చాడో, ఎందుకొచ్చాడో జ్ఞాపకం చేసుకున్నాడు. చివుక్కునలేచి కూర్చున్నాడు.

అరే, తెల్లవారబోతోంది. పూర్తిగా తెల్లవారక ముందే ఈ ఊరు వదిలి వెళ్ళిపోవాలి. ఇంటికి వెళ్ళి పెట్టె తీసుకొని వెళ్ళిపోవాలి. అందులో తన సర్టిఫికెట్లుకూడా ఉన్నాయ్. మళ్ళీ అమ్మ... కాదు ఆ ముఖం కనిపిస్తుందేమో? తను ఆమె ముఖంకేసి చూడలేడు. ఎలా?

వద్దనుకుంటూనే ఇంటివైపుకు నడిచాడు వినయ్. తలుపులమీద చెయ్యి వెయ్యగానే వాటంతట అవే తెరుచుకున్నాయ్. ఖాళీ ఇల్లు చీకటి గుహలా... సింహం చనిపోయిన గుహలా... బోసిగా, జాలిగా వినయ్ ముఖంలోకి చూసింది.

లోపల అడుగుపెడుతున్న వినయ్‌కు కాళ్ళు వొణికాయి. గుండె దడదడలాడింది. ఇల్లంతా పిచ్చివాడిలా కలయతిరిగాడు. తన గదిలోకి వచ్చి కుర్చీమీద కూలబడ్డాడు. ఎదురుగా బల్లమీద మడిచిన కాగితాలు కనిపించాయి. వణుకుతున్న చేతుల్తో కాగితాలు విప్పాడు.

"బాబూ!

"నేను ఇలా పిలుస్తుంటే నీ హృదయం జుగుప్సతో నిండిపోతుందని నాకు తెలుసు. అయినా, నా కడసారి కోరిక ఒక్కటే, ఈ ఉత్తరం పూర్తిగా చదువు. ఇది మీ అమ్మ కథే

కాదు బాబూ! ఇది ఒక అసహాయ స్త్రీ కన్నీటి గాథ. ఆ స్త్రీ దుస్థితికి కారణం ఈ సంఘంలో ప్రతి ఒక్కరూ బాధ్యులేనని నువ్వు తెలుసుకుంటే చాలు బాబూ! అందుకే ఈ ఉత్తరం రాస్తున్నాను.

"నన్ను దూషిస్తూ అసహ్యించుకోకు బాబూ! నేను నీ అమ్మను, నా రక్తంలోని రక్తాన్ని, నా శరీరంలోని కండల్నీ, నా గుండెల్లోని మమతల్నీ పంచుకునే నువ్వు జన్మించావు బాబూ! తల్లిని అసహ్యించుకోవడం అంటే తనను తనే అసహ్యించుకోవటం బాబూ! తనను తను అసహ్యించుకునే వ్యక్తి ఎలాంటి రంపపుకోతకు గురి అవుతాడో నాకు తెలుసు బాబూ! నీకు అమ్మ వున్నదనే విషయాన్ని మర్చిపో. కాని ఆ అమ్మను తల్చుకుంటూ అసహ్యించుకోకు.

'ఛ! ఎంత సిగ్గులేని బతుకు! ఆ బతుకు బతక్కపోతేనేం? నేను ఇంతవరకు పెరిగిందీ, చదివిందీ, ఆ పాపిష్టి డబ్బుతోనా? ఇంత మురికి కూపంలోనా నా శరీరం పెరిగింది? నా రక్తంలో ఇంత మకిలి ప్రవహిస్తోందా?' అని అనుకుంటున్నావు కదూ?

"ఈ పాపిష్టి బ్రతుకు నేను కావాలన్నానా? నాకు పెద్ద చదువులు కావాలన్నానా? నన్ను పెంచి పెద్ద చెయ్యమని కోరానా? ఇంతకంటే పుట్టగానే గొంతు పిసికి ఎందుకు చంపలేకపోయావూ?" అని అన్నావు.

అవును! నువ్వు అవేవీ చెయ్యమని అడగలేదు.

ఏ తల్లీ బిడ్డ అడిగితేనే పెంచదు. తన కొడుకు సుఖంగా వుండాలనీ బాగా చదువుకొని గొప్పవాడు కావాలనీ ఏ తల్లీ కొడుకు అనుమతి తీసుకొని కోరుకోదు బాబూ!

చెడ్డ స్త్రీ వుంటుంది. చెడ్డ కూతురు వుంటుంది. చెడ్డ అక్క చెల్లెలు వుంటుంది. చెడ్డ భార్య వుంటుంది. కాని చెడ్డ తల్లి ఉండదు బాబూ! నేను తల్లిని. చెడు స్త్రీని కావచ్చు. కాని చెడు తల్లిని మాత్రం కాదు.

తల్లి మనసు ఏమిటో నీకు అర్థం కాదు బాబూ! అందుకే నా పాపిష్టి చరిత్ర నీకు చెప్పుకుంటున్నాను. నా ప్రవర్తనకు నీకు సంజాయిషీ ఇచ్చుకుంటున్నాను. ఇంతకంటే దారుణమైన అవమానం స్త్రీ జీవితంలో మరొకటి ఉండదు. ఏ తల్లికీ ఇలాంటి రోజు... తన కన్నకొడుకుముందే అపరాధిగా నిలబడి తన ప్రవర్తనకు సంజాయిషీ యిచ్చుకునే రోజు రాకూడదు. నాకోసం నేను ఈ సంజాయిషీ ఇచ్చుకోవడం లేదు. నీ కోసమే బాబూ! నిన్ను కాల్చేస్తున్న ఆ దారుణ జుగుప్సనుంచి రక్షించటానికే నా ప్రవర్తనను ప్రోత్సహించిన కారణాలను నీ ముందు వుంచుతున్నాను.

నేనూ గౌరవంగల కుటుంబంలోనే పుట్టాను. పెద్దగా ఆస్తిపాస్తులు లేకపోయినా తిండికీ, బట్టకూ కరువులేని కుటుంబంలోనే పెరిగాను. నేను అందంగా వున్నానని నా పేరు 'సుందరి' అని పెట్టారు మా నాన్నగారు. నా అందం చూసి కలిగిన కుటుంబాల్లో సంబంధాలు చాలా వచ్చాయి. కాని నాన్నకు ఆ కుటుంబాల్లో ఏవేవో మచ్చలు కన్పించేవి. వంశ గౌరవం, పరువూ, ప్రతిష్టా అంటే మా నాన్నగారు పడిచచ్చిపోయేవారు. చివరకు నాన్నకు నచ్చిన అంతస్థూ, గౌరవమూ ఉన్న కుటుంబంలో ఇచ్చి నాకు వివాహం చేశారు.

మీ నాన్న చాలా ఉత్తముడు, అమాయకుడుకూడా. నన్ను చాలా ప్రేమగా చూసుకునేవాడు. మూడు సంవత్సరాలు నా జీవితం సుఖ సంతోషాలతోనే గడిచిపోయింది.

ఒక రాత్రి... అదే నా జీవితంలో కాళరాత్రి... వాముల దొడ్లో పాము కరిచిన మీ నాన్నను చేతులమీద తీసుకొచ్చారు. తెలతెలవారుతుండగా నా జీవితలత పెనవేసుకొని

వున్న వృక్షం కూకటివేళ్ళతో కూలిపోయింది. నా నొసటి కుంకుమ రాలిపోయింది. నా కళ్ళలోని వెలుగు ఆరిపోయింది. ఆనాటినుంచీ ఆ ఇంట్లో నాకోసం నరకపు తెరలు లేచాయి బాబూ!

మీ నాన్న పోయేనాటికి నువ్వు నా కడుపులో జీవం పోసుకుంటున్నావు! నువ్వు నా లోపల కదిలినప్పుడల్లా అంధకారమయమైన నా జీవితంలో ఏదో వెలుగురేఖ తళుక్కుమనేది. గుండెలో మమత పొంగులు వారేది. ఏదో అనిర్వచనీయమైన అనుభూతి... నిన్ను గురించిన ఎన్నెన్నో ఊహలు... కలలు.

నాకు అత్తగారు లేరు. మామగారు వృద్ధులు. ఒక బావగారు వున్నారు. మా తోడికోడలు కలిగిన ఇంటిబిడ్డ. అహంకారం, అభిజాత్యం ఆమె నరనరాల్లో జీర్ణించుకు పోయాయి. ఇంట్లో నా స్థానం ఒక పనిమనిషికి వుండేలాంటిది. ఇంటి చాకిరంతా నేనే చేసేదాన్ని. నెలలు నిండినా నాకు ఇంటిచాకిరి తప్పలేదు.

నువ్వు జన్మించావు. తండ్రి గండంతో పుట్టావని అందరూ నిన్ను దూషించారు. కొడుకు పోయిన బాధలో వున్న మీ తాతగారు నిన్ను చూసి మురిసిపోలేదు. బావగారికి పిల్లలు లేరు. మా తోడికోడలు నిన్ను చూసి ఈర్ష్యతో దహించుకుపోయేది. కాని బాబూ, మినుకు మినుకుమనే నీ కళ్ళు, నా కళ్ళలో ఆరిపోయిన జ్యోతుల్ని మళ్ళీ వెలిగించాయి. నా జీవితాన్ని నీకు కవచంగా చేసి నిన్ను రక్షించుకోవాలనుకునేదాన్ని. నీకు ఆరునెలలు నిండాయి.

నాకు ఇంటి చాకిరీ, తోడికోడలు దెప్పిళ్ళూ అంత బాధ కలిగించేవి కావు. కాని మా బావగారు... మీ పెద్దనాన్న ప్రవర్తనే నాకు బాధ కలిగించేది. వీలయినంతవరకూ ఆయన కళ్ళముందు పడకుండా తప్పించుకు తిరిగేదాన్ని. ఆ చూపుల్లో ఏదో ఆకలి... తోడేలు చూసినట్లు చూసేవారు.

ఆరోజు శ్రావణ శుక్రవారం. మా తోటికోడలు నోము నోచుకుంది. నేను తెల్లవారగట్ల తలంటుకొని మల్లు పంచ కట్టుకొని ఇంటి చాకిరంతా చేశాను. రాత్రి భోజనాలు అయ్యాయి. బాగా పొద్దు పోయింది. నేను భోజనం చెయ్యటానికి కంచం ముందు కూర్చున్నాను. ఇంతలో నీ ఏడుపు వినిపించి నా గదిలోకి పరుగెత్తుకొచ్చేను. నీకు పాలు తాగించి పడుకోబెట్టి మంచంమీద కూర్చుని 'జో' కొడుతున్నాను. ఉన్నట్లుండి ఎవరో కొంగుపట్టుకొని లాగినట్టయి వెనక్కు తిరిగి చూశాను. ఉలిక్కిపడి లేచి నిల్చున్నాను. ఇంకా నా కొంగు మా బావగారి చేతిలోనే వుంది అసహ్యంతో వళ్లు జలదరించింది. నోటమాట రాలేదు. నిలువెల్లా కంపించిపోయాను.

"ఈ భాగోతం ఎంత కాలంనుంచి సాగిస్తున్నావే? నీ టక్కులు... అమ్మో... నేను అనుకుంటూనే వున్నా, నా కాపరానికే ఎసరు పెడుతున్నావటే?"

అంటూ మా తోడికోడలు ఏడుపు గొంతుతో కేకలు పెడుతుంటే కళ్ళప్పగించి చూస్తూ నిల్చున్నాను. మా బావగారు పిల్లిలా ఎప్పుడు జారుకున్నారో కూడా చూడలేదు.

మా తోటికోడలు రోడ్డెక్కింది. ఏడుపులూ, పెడబొబ్బలూ.. వీధిలో నలుగూరూ చేరారు. ఎవరో నా బట్టలు విప్పేసి నడిరోడ్డుమీద నిల్చోబెట్టినట్లయింది నా పని. మా మామగారు నానా తిట్లూ తిట్టారు. అక్కడ చేరిన పదిమందీ తలోకరాయి విసిరారు. నా ప్రాణం విలవిలలాడిపోయింది. తల నేలకు కొట్టుకొని చచ్చిపోవాలనిపించింది. నేను నిల్చున్న భూమి నన్ను తన గుండెల్లోకి తీసుకోవాలనిపించింది.

మా మామగారూ, తోటికోడలూ ఆ ఇంట్లో ఒక్కక్షణం వుండటానికి వీల్లేదన్నారు! ఆ వంశానికి మచ్చ తెచ్చానన్నారు. ఏనాడూ కనీవినీ ఎరగని అప్రతిష్ట ఆ వంశానికి తెచ్చానన్నారు. నేను మామగారి కాళ్ళమీద పడ్డాను. ప్రాధేయపడ్డాను. జరిగింది చెప్పాలని ప్రయత్నించాను. తోడేళ్ళ మధ్య నోరులేని మేకలా వణికిపోయాను. నీతో సహా నన్ను బయటకు నెట్టారు. నా పెట్టె తెచ్చి బయట పారేశారు. కనీసం ఆ రాత్రికి ఇంట్లో తలదాచుకోనివ్వమని వేడుకున్నాను. ససేమిరా అన్నారు. ఆ రాత్రి గొడ్ల చావిట్లో నిన్ను పెట్టుకొని కూర్చుని తెల్లవార్లూ జాగారం చేశాను. ఊరు బయట చెరువులో పడి చావాలనుకున్నాను. కాని... బాబూ... నా వళ్ళో ఎంతో హాయిగా, నిశ్చింతగా, అమాయకంగా నిద్రపోతున్న నీ ముఖంలోకి చూస్తూ అంతపని చెయ్యలేకపోయాను.

ఎక్కడకు పోవాలి? వయస్సులోవున్న ఒక స్త్రీ, చంకలో రెక్కలురాని పసిపాపతో ఎక్కడ తలదాచుకోవాలి? ఎవరు రక్షణ ఇస్తారు? ఎందుకిస్తారు? ఎందుకివ్వాలి?

ఇంత అపవాదు నెత్తినెత్తుకొని నాన్న ముఖం ఎలా చూడను? అసలు నాన్నగానీ, అన్నయ్యగానీ ఇంట్లో అడుగుపెట్టనిస్తారా? నాకు తెలుసు నాన్నకూ, అన్నయ్యకూ నా కంటే వంశం, గౌరవం, ప్రతిష్టా ఎక్కువని. నా మాట ఎవరు నమ్ముతారు? అనాదిగా ఆడదాని బతుకింతేనా?

కాలినడకన గుంటూరు చేరుకున్నాను. రెండు రోజులు సత్రంలో వున్నాను. ఆ వున్న రెండు చేతి గాజులు అమ్ముకున్నాను. హైదరాబాద్ చేరుకున్నాను. అంత పెద్ద పట్నంలో దిగిన నాకు దిక్కు తోచలేదు. ఎక్కడకు పోవాలో తెలియలేదు. స్టేషన్‌లోనే విశ్రాంతి గదిలో రెండు మూడు రోజులున్నాను. రైల్వే కూలీల దగ్గిర నుంచీ అందరి కళ్లూ నా మీదే. అందరి కళ్ళలో కుతూహలమే, నా శరీరం, మనసూ అవమానంతో దహించుకుపోసాగాయి. రెండుమూడుసార్లు రైలుకింద తలపెట్టేద్దాం అనుకున్నాను.

అయినా నేను ఎందుకు బతికాననుకున్నావ్ బాబూ? బతుకుమీది తీపితోకాదు. శరీరం మీది మమకారంతో కాదు. కేవలం నీ కోసం, నీ కోసమే బాబూ! నీ తల్లికి జరిగిన అవమానం తెలియని నువ్వు ఆనందంగా బోసి నవ్వులు నవ్వుతుంటే... చూస్తూ చూస్తూ నిన్ను దిక్కులేనివాణ్ణిచేసి వెళ్ళలేకపోయాను. రాత్రంతా వెయిటింగ్ రూంలో పడుకోవడం, పగలు పనికోసం తిరగటం... ఇలా ఒక వారం గడిచింది.

అతికష్టంమీద ఒక ప్లీడరుగారింట్లో వంటమనిషిగా కుదిరాను. అన్నం పెట్టి నెలకు పాతికరూపాయలు ఇస్తానన్నారు. నా కాళ్ళకు భూమి ఆనినట్లనిపించింది. వాళ్ళింట్లోనే సర్వెంట్సుకోసం కట్టిన ఒక పూరి పాకలో వున్నాను.

చీమ నడకలా జీవితం నడుస్తూవుంది. నీకు ఐదేళ్ళు వచ్చాయి. పచ్చగా, బొద్దుగా ముద్దుల మూటగట్టే నిన్ను చూసి మా యజమానురాలు “మా ఇళ్ళలో పుట్టాల్సిన కుర్రాడు, నీ కడుపున పుట్టాడు” అనేది.

ఆ మాట అన్నప్పుడల్లా నా కడుపులో ఏదో కలియబెట్టినట్టయ్యేది. ఒకప్పుడు ‘నేనూ మీ కంటే గౌరవంగా బతికినదాన్నే’ అని అనాలనిపించేది. కాని ఆ మాటల్ని చేదు మందులా బయటకు రాకుండా మింగేసేదాన్ని.

మా యజమాని కొడుకు శ్రీనివాస్ నీ వయసువాడే.

ఒకరోజు సాయంత్రం వెండిగిన్నెలో పాలఅన్నం కలిపి వెండిస్పూన్‌తో తినిపిస్తున్నాను. వాడు ముద్దముద్దకూ బతిమాలితేగాని నోరు తెరవడు. గంటసేపు అన్నం

తింటాడు. ఆ రోజు మరీ మంకు పట్టుపట్టాడు. ముద్ద నోట్లో పెట్టగానే బయటకు వూయటం, పారిపోవటం, మళ్ళీ వాణ్ణి పట్టుకొని బతిమాలి మరో ముద్ద పెట్టడం-నువ్వు అప్పుడే నిద్రలేచి వచ్చావు. ఆకలంటూ ఏడుస్తూ, నా కొంగు పట్టుకొని వదలకుండా వేధిస్తున్నావు. శ్రీనివాస్‌కు పెట్టడానికి స్పూన్‌తో అన్నం తీసినప్పుడల్లా నువ్వు నోరు తెరిచేవాడివి. అప్పుడు నా మనస్సు ఎంత నరకయాతన అనుభవించిందో ఎలా చెప్పను బాబూ? నేను తల్లిని. నా చేతిలో పాలన్నం వెండిగిన్నెలో వుంది. నా కన్నబిడ్డ ఆకలని ఏడుస్తూ వుంటే, మరో అమ్మ కన్నబిడ్డను బతిమాలుతూ తినిపిస్తున్నాను. చివరకు విసు గెత్తి నిన్ను చచ్చేలా బాదాను, నువ్వు ఏడుస్తూ మన గుడిసెలోకి వెళ్ళిపోయావు.

ఆ రాత్రి ఎంత బతిమాలినా నువ్వు అన్నం తినలేదు. స్పూన్‌తో పెట్టమని మారాం చేశావు. చివరకు ఏడ్చి ఏడ్చి నిద్రపోయావు. నేను అన్నం తినకుండానే గ్లాసుడు మంచి నీళ్లు తాగి నీ పక్కనే పడుకున్నాను.

రెండో రోజు యజమానిరాలితో చెప్పాను- నువ్వు స్పూన్‌తో అన్నం పెట్టమని మారాం చేశావని. ఆమె నవ్వింది. ఆమె చాలా మంచిది. శ్రీనివాస్ పాతబడిన బట్టలు నీ కిచ్చేది.

ఆరోజు రాత్రి పది గంటలకు నువ్వు నిద్రపోతున్నావు. యజమాని, అతని భార్య హడావిడిగా మన పాకలోకి వచ్చారు. వెండిగిన్నె, స్పూన్ కన్పించడం లేదన్నారు. నేను గాబరాపడ్డాను. ఆ సాయంకాలమే శ్రీనివాస్‌కు అన్నం తినిపించి గిన్నె డైనింగ్ టేబుల్‌మీద పెట్టి వచ్చేశాను. శ్రీనివాసూ, నువ్వూ ఆ సమయంలో కూర్చుని ఆడుకుంటున్నారు.

యజమాని నా ఇంట్లో సోదా చేస్తుంటే అవమానంతో కుంగిపోయాను. అతను సోదా చెయ్యడం అమ్మగారికీ అంత ఇష్టం ఉన్నట్లు కన్పించలేదు.

"ఇదిగో!" అంటూ మంచినీళ్ళకుండ పక్కగా వున్న గిన్నె, స్పూన్ తీశాడు యజ మాని.

నేను స్థాణువులా నిలబడిపోయాను. యజమానురాలు నా ముఖంలోకి తిరస్కారంగా చూసింది. అది అక్కడకు ఎలా వచ్చిందో అర్థంకాలేదు. తెల్లవారి నన్ను మరోచోట పని చేసుకోమనీ, పాక ఖాళీ చెయ్యమనీ చెప్పడం మాత్రం వినిపించింది.

వాళ్ళలా పోగానే నిద్రపోతున్న నిన్ను గట్టిగా బాదాను. ఘొల్లున ఏడుస్తూ లేచావు. కసితీరా బాదాను. 'దొంగ వెధవా!' అని తిట్టాను. ఏడుస్తున్న నిన్ను చూస్తూ నేనూ ఏడ్చాను. ఆ రాత్రంతా జీవితంచేత చావు దెబ్బలు తిన్న నేనూ, నాచేత దెబ్బలు తిన్న నువ్వూ, ఇద్దరం కలత నిద్రపోయాం. మధ్య మధ్య నిద్రలో ఉలిక్కిపడుతూనే వున్నాం.

రెండోరోజు అమ్మగారితో నిజం చెబుదామనుకున్నాను. కాని మరుక్షణంలో మనస్సు మార్చుకుని పాక ఖాళీ చేశాను. ఎందుకో తెలుసా బాబూ? నా బిడ్డ దొంగ అని చెప్పటం ఇష్టంలేకనే!

పక్కింటి పనిమనిషి తను వుండే ఇళ్ళ దగ్గిర నెలకు ఓ పది రూపాయల్లో ఓ పాక చూపించింది. ఆ ప్రాంతాల్లో పెద్దవాళ్ళ వాసనకూడా తగలదు. అందరూ మనలాంటివాళ్ళే. రెక్కాడితేగాని డొక్కాడని వాళ్ళు. నేలబారు బతుకులవాళ్లు. మళ్ళీ పనికోసం తిరగని గడపలేదు. ఆరు మాసాలపాటు ఆ ఇంట్లో, ఈ ఇంట్లో పాచిపని చేసుకుంటూ గడిపాను. నిన్ను దగ్గర్లోవున్న చిన్న స్కూల్లో చేర్పించాను. ఎవరి ద్వారానో ఒక షావుకారుగారి ఇంట్లో వంటమనిషి కావాలని తెలిసి వెళ్ళాను.

షావుకారు పేరు చలపతి. దాదాపు ఏభై ఏళ్ళుంటాయి. బట్టల వ్యాపారం, చాలా పెద్ద భవంతి. వాళ్ళది పెద్దసంసారం. ముగ్గురు ఆడపిల్లలూ, ఇద్దరు మొగపిల్లలు. నలుగురు కాలేజిలో చదువుతున్నారు. చిన్నపిల్ల హైస్కూల్లో చదువుతోంది. సంవత్సరం క్రితం భార్య పోయింది. నెలకు నలభై రూపాయలకు ఒప్పుకున్నాను. మరో ఆరు నెలలు గడిచిపోయింది. నీకు ఆరో సంవత్సరం వచ్చింది. అవి కావాలి, ఇవి కావాలని మారాం చెయ్యడం మొదలుపెట్టావు.

క్రమంగా మా యజమాని ప్రవర్తనలో మార్పు కన్పించసాగింది. ఎంత తప్పుకు తిరగాలని ప్రయత్నించినా వీలుపడేదికాదు. మంచినీళ్ళుగానీ, కాఫీగానీ అందు కుంటున్నప్పుడు కావాలనే చెయ్యి తాకేవాడు. ఏదో పనిచేస్తున్న నా దగ్గరకు వచ్చి నిలబడేవాడు. నేనూ అర్థం అయీ కానట్లు నటించేదాన్ని. మళ్ళీ ఆ పని పోతుందేమోనని భయం పట్టుకుంది.

ఒకరోజు నువ్వు స్కూలునుంచి ఏడుస్తూ వచ్చావ్. వళ్ళంతా బెత్తం దెబ్బలతో వాచివుంది. మాస్టరు కొట్టాడని చెప్పావు. నా ప్రాణాలు విలవిల్లాడిపోయాయి. రెండో రోజు నిన్ను తీసుకొని స్కూలుకు వెళ్ళాను విషయం తెలిసి నాకు మతిపోయినంత పనయింది. నీ పక్క కుర్రాడి పెన్ పోయిందట. అందరి బ్యాగ్‌లూ వెతికితే అది నీ బ్యాగ్‌లో దొరికిందట.

వెర్రికోపంతో ఊగిపోయాను. అవమానంతో దహించుకుపోయాను. పిచ్చిగా బాదాను. ఏడుస్తున్న నిన్ను అక్కడే వదిలేసి పనిలోకి వెళ్ళిపోయాను. ఆ రోజూ నా మనసు మనసులో లేదు. నువ్వు దొంగవు కాకూడదని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకున్నాను.

రాత్రికి ఇంటికి వచ్చేటప్పటికి నువ్వు జ్వరంతో పడివున్నావు. పలవరిస్తున్నావ్.

"నన్ను కొట్టకమ్మా! ఇంకెప్పుడూ దొంగతనం చెయ్యను" అంటున్నావు.

నా కడుపు తరుక్కుపోయింది. గుండె చెరువయింది. కన్నీళ్ళు కారిపోతున్నాయి. కాని వాటికి విలువేముంది బాబూ? బీదవాళ్ళ కన్నీళ్ళు కారి కారి వాళ్ళనే ముంచేస్తాయి.

రెండో రోజూకూడా నీకు పూర్తిగా జ్వరం తగ్గలేదు. నేను పనిలోకి వెళ్ళలేదు.

"ఎందుకు బాబూ పెన్ తీశావు? అట్లా తియ్యడం తప్పుకాదూ?" అన్నాను పక్కనే పడుకొని.

"మరి రాసుకోడానికి పెన్ కావద్దూ? వాడిదగ్గర రెండున్నాయ్. అందుకే ఒకటి తీసుకున్నాను."

"తప్పు బాబూ అలా తీసుకోకూడదు, నిన్నందరూ దొంగబ్బాయి అంటారు."

"మరి వాడికి రెండు పెన్నులెందుకు? నాకు ఒక్కటీ లేదుగా?"

"వాళ్లు డబ్బున్నవాళ్ళు బాబూ! ఎన్ని పెన్నులైనా వుంటాయి."

"మరి మన కెందుకు డబ్బులేదు?"

"నీ ప్రశ్నకు ఏం సమాధానం చెప్పను బాబూ! బాగా బాగా చదువుకున్నవాళ్ళే చెప్పలేకపోతున్నారు."

"వాళ్ళకు అంతడబ్బెందుకుంది?" మళ్లీ ప్రశ్నించావు.

"అది వాళ్ళ అదృష్టం!"

"అదృష్టం అంటే? అది మనకెందుకు లేదు?"

"దేవుడు వాళ్ళను అదృష్టవంతులుగా పుట్టించాడు బాబూ!"

"దేవుడు చాలా చెడ్డవాడా అమ్మా?"
"తప్పు బాబూ, అలా అనకూడదు. కళ్లుపోతాయ్."
"ఏం ఎందుకనకూడదు. విజయ్‌కు రెండు పెన్నులిచ్చాడు. నాకు మరి ఒక్కటి కూడా ఇవ్వలేదు. దేవుడు మంచివాడు కాదు-" అన్నావు.
నీకేం సమాధానం చెప్పాలో తెలియలేదు బాబూ!
ఆరోజు ఆదివారం. నేను మధ్యాహ్నం ఇంటికి వస్తున్నాను. బెలూన్లు, బూరలూ అమ్మేవాని చుట్టూ పిల్లలు వున్నారు. చాలామంది చేతుల్లో బెలూన్లు వున్నాయ్. ఆ పిల్లల మధ్యలో నువ్వూ కన్పించి ఆగిపోయాను. బెలూన్లు అమ్మే కుర్రాడి పక్కనే నిల్చుని బెలూన్ల కేసి దీక్షగా చూస్తున్నావు. నేను దగ్గిరకొచ్చేలోపే నువ్వు ఒక బెలూన్ తెంచుకొని పరుగు లంకించుకున్నావ్. మిగతా పిల్లలంతా 'దొంగ' 'దొంగ' అంటూ నిన్ను పట్టుకున్నారు. బెలూన్లవాడు నిన్ను ఆ చెంపా, ఈ చెంపా వాయించాడు. నేను పరిగెత్తుకొచ్చి నిన్ను ఎత్తుకున్నాను. అక్కడినుంచి నిన్ను తీసుకొని వచ్చేస్తుంటే వెనక పిల్లలు... "వినయ్ దొంగ, వినయ్ దొంగ, రేపు మాస్టరుతో చెబుదాం" అంటూ కేకలు వేస్తూ చప్పట్లు కొడుతున్నారు.
ఆరోజు నిన్ను కొట్టలేదు. కాని నేనే ఇంటికి రాగానే బావురుమని ఏడ్చాను.
నా ఆశలన్నీ నీమీదే పెట్టుకొని బతుకుతున్నాను. నిన్ను చదివించాలనీ, పదిమందిలో ఒక్కడిగా నిలబెట్టాలనీ ఏవేవో పిచ్చి ఆశలు పెంచుకున్నాను. నువ్వు చూస్తే ఇలా తయారవుతున్నావు. అక్కడ యజమాని ఇంట్లో నాకు దిన దిన గండంగా గడుస్తోంది.
ఒకరోజు చలపతి స్పష్టంగానే బయటపెట్టాడు. నాకు మంచి ఇల్లు కట్టిస్తా నన్నాడు. నిన్ను బాగా చదివిస్తానన్నాడు. నాకు అతని ముఖంమీద ఖాండ్రించి ఉమ్మి వచ్చేయ్యాలనిపించింది. కాని ఏం చెయ్యడం? నాకు ఇష్టంలేదనీ, మరోసారి ఇలాంటి మాటలంటే వాళ్ళ పెద్దబ్బాయికి చెబుతాననీ అన్నాను. ఆ తర్వాత చలపతి నా జోలికి రాలేదు. పనిలోనుంచి తీసేస్తానని బెదిరించలేదు.
ఆరోజు పిల్లలంతా సినిమాకు వెళ్ళారు. నేను వంటింట్లో కూరగాయలు కోస్తు న్నాను. మా షావుకారు వచ్చి పక్కగా కూర్చున్నాడు. ఒక్కసారిగా లేచి నిల్చున్నాను. అతను గబుక్కున నన్ను రెండు చేతుల్లో పట్టుకున్నాడు. పెనుగులాడి వదిలించుకున్నాను. ఆడపులిలా అరుస్తూ కత్తిపీట ఎత్తాను, విసరబోయి ఆగిపోయాను.
"పిచ్చి ఆలోచనలు పెట్టుకొని చెడిపోకు. ఇలా ఎంతకాలం బతుకుతావ్? నీ యవ్వనమంతా..."
"నోరుముయ్!"
"నేను మూసినా మరొకడు తెరుస్తాడు."
"ఛీ! పశువా?" అంటూ కత్తిపీట విసిరి నేలమీద కొట్టాను. బయటికి నడవబోయాను. అతను వాకిలికి అడ్డంగా నిలబడ్డాడు.
"తప్పుకో!" గట్టిగా అరిచాను.
"భయపడకు. నీకు ఇష్టం లేకుండా బలవంతం చెయ్యనులే. ఆలోచించుకో. నాకు భార్యలేదు. నీకు భర్తలేదు. నీ కొడుకు చాలా తెలివైనవాడు. రాజాబిడ్డలా వుంటాడు. వాడి భవిష్యత్తు గురించైనా ఆలోచించు," అంటూ పక్కకు తప్పుకున్నాడు.

నేను రోడ్డుమీదకు పరిగెత్తాను. ఎలా నడుస్తున్నానో నాకే తెలియదు.

మన ఇంటి దగ్గిర్లోకి వచ్చిన నాకు నువ్వు కన్పించావు.

నలుగురైదుగురు పిల్లలు ఆడుకుంటున్నారు. ఇద్దరు పిల్లలు నీ క్లాసువాళ్ళను కుంటా, ఏదో తింటున్నారు.

నువ్వు చెయ్యి చాపావు. అందులో లావాటి కుర్రాడు నీకు పెట్టబోతున్నట్లు ముందుకు చెయ్యిచాచి వెంటనే నోట్లో వేసుకున్నాడు. అందరూ చప్పట్లు కొట్టి నవ్వారు. నువ్వు బిక్క మొహం వేశావు. రెండోవాడు "ఇంద" అంటూ నీకు మిఠాయి పెట్టబోయాడు. నువ్వు ఆశగా చెయ్యి చాపగానే వాడు గబుక్కున చెయ్యి వెనక్కు తీసుకొని నోట్లో వేసుకొని వెక్కిరించాడు.

మళ్ళీ అందరూ చప్పట్లూ, నవ్వులూ. నీ ముఖం కోపంతో కందిపోవడం నాకు స్పష్టంగా కనిపించింది. నేనే పిచ్చిదానిలా చూస్తూ నిలబడ్డాను.

నువ్వు కోపంతో చిన్నవాడిమీద కలబడ్డావు. అంతలో వాడి అన్న ముందుకి దూకి నిన్ను ఒక్కతోపు తోశాడు. కిందబడ్డ నీ గుండెలమీద కూర్చున్నాడు.

"బికారి వెధవా! నా తమ్ముడ్ని కొడతావంటరా?" అంటూ జుట్టు పట్టుకొని పీకసాగాడు.

ఒక్కదూకులో నీ దగ్గరకొచ్చి వాణ్ణిలాగి నిన్ను తీసుకొని ఇంటికొచ్చాను.

ఆ రోజు నేను నిన్ను కొట్టిన దెబ్బలు నువ్వు మర్చిపోయి వుంటావు, కాని నేను మర్చిపోలేదు బాబూ!

ఇంత విషం తెచ్చి నీకు పెట్టి, నేను తినాలనుకున్నాను. నిన్ను ముందుపడేసి బావిలోకి దూకుదామనుకున్నాను. పాకకు నిప్పంటిద్దామనుకున్నాను.

నిద్రలో ఉలిక్కి ఉలిక్కిపడుతున్న నీ మీద చెయ్యివేసి పడుకున్నాను.

ఆలోచనలు రేసుగుర్రాల్లా పరుగులు తీస్తున్నాయ్. ఏదో మొండితనంలాంటిది మనస్సును చుట్టేసింది. ఎవరి మీదో కసిగా వుంది. చివరకు నిన్ను చంపలేననిపించింది. నిన్ను వదిలేసి చచ్చిపోదామనుకున్నాను.

కాని మళ్ళీ ఆలోచనలు, నా తర్వాత నువ్వేమవుతావు? దొంగవు అవుతావు. బికారివి అవుతావు. అడుక్కు తింటావు. లేకపోతే జేబులుకొట్టి జైలుకు పోతావు.

కణతలు పగిలిపోతున్నాయి. తలలో ఏదో హోరు. మనస్సు మాత్రం ఘోషిస్తోంది.

నా బిడ్డ దొంగ కావటానికి వీల్లేదు. నా రాజా అడుక్కు తినకూడదు.

నా బాబు దొంగ కాడు, జేబులు కొట్టడు. ఇతర్లముందు చెయ్యి చాపడు.

నా బాబు చదువుకుంటాడు. అందగాడవుతాడు. గొప్ప ఉద్యోగస్తుడు అవుతాడు. పెద్దింటి పిల్లను పెళ్ళి చేసుకుంటాడు.

నా బాబు దొంగ కాకూడదు. అడుక్కు తినకూడదు. జేబులు కొట్టకూడదు, వాణ్ణి చదివిస్తాను. గొప్పవాణ్ణి చేస్తాను. పదిమందిలో నిలబెడతాను.

ఒక నిర్ణయానికి వచ్చేశాను. రెండోరోజు నా నిర్ణయం షావుకారుకు చెప్పాను.

వారం తిరక్కుండానే మన మకాం ఒక పెంకుటింట్లోకి మారింది. నీకు కొత్త బట్టలు కుట్టించాను. నువ్వు అడిగిన బొమ్మలన్నీ కొనిపెట్టాను. వెండిగిన్నె, వెండి స్పూను కూడా కొన్నాను.

అంతులేని సంతోషంతో కిలకిల మాట్లాడేస్తున్నావ్.

"అమ్మా! అమ్మా! మనంకూడా విజయ్, రవీ వాళ్ళలా గొప్పవాళ్ళం అయాం కదూ? దేవుడు మనక్కూడా అదృష్టం ఇచ్చాడు కదూ? ఇంకెప్పుడూ దేవుణ్ణి తిట్టను" అన్నావు బాబూ కొత్త బట్టలు వేసుకుంటూ.

అప్పుడు నా మానసిక పరిస్థితి ఎలా వుందో ఏం చెప్పను బాబూ? నా కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. నువ్వు చూడకుండా తుడుచుకున్నాను.

ఒకరోజు నిన్ను స్కూలుకు పంపించటానికి నేను వచ్చాను. ఆరోజు హెడ్‌మాస్టరు నాకేసి అదోలా చూశాడు. మీ క్లాసు మాస్టరు "ఏం సుందరమ్మా? ఇప్పుడు నీ పని బాగానే ఉన్నట్లుందే? ఒక కంట మమ్మల్ని కూడా కనిపెట్టివుండు" అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

ఆ రోజునే నాకు అర్థం అయింది బాబూ, నా నీడలో నువ్వు పెరగలేవనీ, పెరగకూడదనీను.

ఆ విషయమే షావుకారుగారితో మాట్లాడాను. నిన్ను కోరుకొండ సైనిక్ స్కూలుకు పంపించాలని వుందన్నాను. ఆయన అభ్యంతరం చెప్పలేదు. నీ స్కూలు చదువు ముగిసేంత వరకూ ఒక్కసారికూడా నిన్ను ఈ ఊరు రానివ్వలేదు. శెలవులకు నేనే వచ్చేదాన్ని. ఎన్నోసార్లు నువ్వు ఇంటికి తీసుకెళ్ళమని అడిగావు గుర్తుందా బాబూ? ఏదో వంక చెప్పేదాన్ని. నువ్వు స్కూలు వదలబోయే సంవత్సరమే షావుకారుగారు చచ్చిపోయారు. ఆయన పోతూ పోతూ తన మాట నిలబెట్టుకున్నారు. నీ చదువు సంధ్యలకని పదివేలు నా పేర బ్యాంక్‌లో వేశారు. ఆయన నన్ను బాగా అభిమానంగానే చూశారు.

ఆయన చనిపోయాక ఆ పెంకుటిల్లు అమ్మేసి, ఊరి చివర కొత్తగా కట్టిన కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకున్నాను. నా పాత జీవితాన్ని పూర్తిగా పాతిపెట్టేశాను. నిన్ను కాలేజీలో చేర్పించాను. నువ్వు ఎం.ఎ. పాసయినరోజు నా అంత అదృష్టవంతురాలు లేదని పొంగిపోయాను. ఎవరో జడ్జీగారి అమ్మాయి నిన్ను ప్రేమించిందనీ, జడ్జీగారు మీ వివాహానికి అంగీకరించారనీ నువ్వు చెప్పిన రోజు ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయాను. నిన్ను గర్వంగా చూసుకున్నాను.

కాని, నా జీవితమే నన్ను కసిగా నా వెంటబడి తరుముతోందని అర్థం చేసుకోలేకపోయాను. కాళ్లు భూమిమీద బలంగా మోపాలని ప్రయత్నించినప్పుడల్లా భూదేవి నన్ను దగా చేస్తూనే వుందని ఊహించలేకపోయాను.

రామనాథంగారు ఆ రోజుల్లో హైకోర్టులో ప్రాక్టీసు చేస్తుండేవారు. షావుకారు గారూ, ఆయనా స్నేహితులు. నే నెవర్నో ఆ రామనాథంగారికి తెలుసు. అందుకే నేను చెడిపోయినదాన్ని అని రేఖ అన్నది.

అవును బాబూ! నేను చెడిపోయినదాన్నే! కాని అదే పని చేసిన షావుకారుగారు కూడా చెడిపోయినవారేగా! ఆయన కూతుర్ని రామనాథంగారు తన కొడుక్కు ఎలా చేసుకున్నారు? ఆడదాని శరీరం మాత్రమే చెడిపోతుందా? కుళ్ళిపోతుందా? మగవాడి శరీరంలో చీమూ, రక్తం వుండదా? చలపతిగారి కూతుర్ని తన కోడలుగా చేసుకోవడానికి అభ్యంతరం లేదుకాని, నా కొడుకుని అల్లుడిగా ఊహించలేదు రామనాథంగారు.

బాబూ! ఒక్కసారి ఆలోచించు. తప్పంతా తోడేలు నోటికి చిక్కిన మేకపిల్లదేనా? నీ పక్కవాడికి రెండు పెన్నులుండి, నీకు ఒక్కటికూడా లేకపోవడం నీ తప్పా బాబూ? పొద్దస్తమానం బిస్కెట్లూ, చాక్లెట్లూ తిని తిని, సాయంకాలం పాలన్నం మింగలేక ఊసేస్తున్న

పరాయిబిడ్డకు బలవంతంగా అన్నం నోట్లో కుక్కుతూ, తన కొంగు పట్టుకొని "అమ్మా ఆకలే" అంటూ పేగులు కదిలిపోయేలా ఏడుస్తూ... తల్లి చేతిలోని ముద్దకోసం నోరు తెరిచిన తన కన్నబిడ్డ నోట్లో అన్నం పెట్టలేని తల్లి అసహాయతకు బాధ్యులు ఎవరు? ఆ తల్లి మాత్రం కాదు - నువ్వేమంటావ్?

ఆ తల్లేనంటావా బాబూ?

ఇదంతా ఎందుకు చేశావు? అటువంటి పాడు బతుకు ఎందుకు బతికావు? అని నువ్వు నిలదీసి అడిగితే "నేను అమ్మను. అమ్మను కనకే చేశాను" అని మాత్రమే చెప్ప గలను బాబూ!

నన్ను అసహ్యించుకోకు బాబూ! అదొక్కటే నేను కోరుకునేది.

నువ్వు బాగా పొద్దుపోయినా ఇంటికి రాలేదు. నా ముఖం చూడాలంటే నీకు అసహ్యంగా వుందని నాకు తెలుసు. అందుకే నేను వెళ్ళిపోతున్నాను. నీనుంచి చాలా దూరంగా వెళ్ళిపోతున్నాను.

"నా బాబు దొంగకాడు, బికారి కాడు" అనే సంతృప్తితో వెళ్ళిపోతున్నాను.

నా కడసారి దీవెనలు అందుకో బాబూ!

ఇట్లు,
నీ,
అమ్మ."

ఉత్తరం చదివి ముగించిన వినయ్ అచేతనంగా వుండిపోయాడు. అలా ఎంతసేపు... ఎన్ని గంటలు వుండిపోయాడో అతనికే తెలియదు. భుజంమీద ఎవరిదో చెయ్యి మృదువుగా పడటంతో ఉలిక్కిపడి ఈ ప్రపంచంలోకి వచ్చాడు.

"నన్ను క్షమించు వినయ్! నువ్వు లేకుండా నేను బతకలేను. తల్లిదండ్రులు చేసిన తప్పుకు బిడ్డలు బాధ్యులు కారు. మీ అమ్మ చేసిన తప్పుకు..."

"రేఖా!" అగ్నిపర్వతంలా బద్దలయాడు వినయ్.

"మా అమ్మ తప్పు చెయ్యలేదు. మా అమ్మ దేవత. మా అమ్మను వెతుక్కుంటూ వెళుతున్నాను. అమ్మ కన్పిస్తే తిరిగొస్తాను-" అంటూ గబగబా బయటకు నడిచాడు వినయ్.

అలా వెళ్ళిపోతున్న వినయ్‌ను కళ్ళప్పగించి చూస్తూ నిల్చుండిపోయింది రేఖ.

(1976 జ్యోతి మాసపత్రిక)